క్లుప్తంగా

ఆత్మహత్యాయత్నానికి కారకులను శిక్షించాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

దుమ్ముగూడెం: మండలలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న ఏకలవ్య మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యయత్నానికి సంబంధించి కారకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు, కోకన్వీనర్ జానీ పాషాలు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇంటర్ విద్యార్థిని ధనలక్ష్మిని ఏకలవ్య పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, వార్డెన్ మానసికంగా వేధించడంతో పాటు తన తల్లిదండ్రులను పిలిపించి అక్రమ నిందలు వేసి అవమానించారని, అవమానం భరించలేకనే ఇంట్లో ఉన్న పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిందని అన్నారు. కారకులైన ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, వార్డెన్‌లను తక్షణమే సస్పెండ్ చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తూరి సీతారామారావు, మాజీ కార్యదర్శి కణితి లక్ష్మణ్, జిలకర గంగ రాజు, వాగే కృష్ణ, కొమరం చెంచయ్య, ధర్మ రాజు, పొడకలపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

త్రీ ఫేస్ విద్యుత్ కోసం వినతి

దుమ్ముగూడెం: మండలంలోని జడ్ వీరభద్ర పురం గ్రామానికి చెందిన రైతులు తమ గ్రామంలో పంటపొలాలకు అవసరమయ్యే త్రీ ఫేస్ కరెంట్ సదుపాయం కల్పించాలని కోరుతూ మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. త్రీఫేజ్ విద్యుత్ ఏర్పాటుకు అందుకు గానూ ఖర్చయ్యే నిధులను భరించే సామర్థ్యం తమ చిన్న, సన్నకారు రైతులకు లేదని, శాసన సభ్యుడిగా రైతాంగానికి భరోసానిచ్చేలా నిధులను ఐటీడీఏ లేదా ఇతర నిధుల నుంచి వెచ్చించాలనిని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్ వీరభద్రపురం రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సత్కారం



టీజీఓ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన నరేందర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

చర్ల: తెలంగాణా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం భద్రాద్రి జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.నరేందర్‌ను మంగళవారం చర్లలో ఘనంగా సత్కరించారు. చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఉద్యోగల సమస్యల పరిష్కారం కొనసాగుతున్న పోరాటాల్లో చురుగ్గా పాల్గొంటున్నందునే నరేందర్‌కు ఈ పదవి వరించిందని, రానున్న రోజుల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మరింతగా పోరాడాలని ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నసమారాధన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి సమీపంలోగల వెంకమ్మ చెరువు కట్టపై ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయం, నందమూరినగర్ వద్ద ఉన్న వీరాంజనేయస్వామి, అశ్వారావుపేటలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం సందర్భంగా స్వామి వార్లను పూలతో అలంకరించి, వివిధ రకాల పూజలు చేశారు. అనంతరం భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద అయప్ప, భవానీ మాలధారులకు, వీరాంజనేయస్వామి ఆలయం దగ్గర భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

అనవసర ప్రశ్నలు తొలగించాలి

అశ్వాపురం: రాష్ట్రంలో జరుగుతున్న కుల గణన సర్వేలో అవసరం లేని ప్రశ్నలు తొలగించాలని మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్వేలో కొన్ని ప్రశ్నలకు ఇబ్బందికరంగా ఉన్నాయని సెల్ నంబర్లు, ఆధార్‌కార్డుల నంబర్లు, సైబర్ క్రైమ్ చేతికి చిక్కితే చాలా ప్రమాదం పొంచి ఉందన్నారు. వ్యక్తిగత గోప్యత పాటించాలని కోరారు. కొన్ని చోట్ల ఏ పార్టీ అని అడగటం కూడా విడ్డూరంగా ఉందన్నారు. కులగణనకు అందరూ సహకరిస్తామని తెలిపారు.

చెయ్యెత్తినా బ్రేకు పడట్లే..

- గ్రామాల్లో ఆగని ఆర్టీసీ అద్దె బస్సులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు



భద్రాచలం ఆర్టీసీ డిపో పరిధిలోని ఓ అద్దె బస్సు..

చర్ల: చెయ్యెత్తండి.. బస్సెక్కండి.. ఇదంతా పాత మాట. మా ఇష్టమైతే బస్సు ఆపుతాం.. లేకుంటే లేదు.. ఇది కొత్త మాట. గ్రామాల్లో బస్సులు ఆపని ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల తీరుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎక్కడైనా బస్సు ఆపండని చెయ్యెత్తి బస్సు ఎక్కొచ్చు. కానీ బస్టాప్‌లలోనే చెయ్యెత్తినప్పటికీ బస్సులను ఆపకుండా వెళ్తున్నాయి. భద్రాచలం ఆర్టీసీ డిపో పరిదిలోని చర్ల, వెంకటాపురం రూట్‌లో ఆర్టీసీ బస్సుల పరిస్థితి ఇది. బస్సుల లేమితో సంస్థ సగానికి పైగానే అద్దె బస్సులను నడుపుతోంది. ఈ క్రమంలో బస్సులో 60 మంది వరకు కూర్చునే అవకాశం ఉండగా, మరో 20 నుంచి 30 మంది వరకు నిల్చొని ప్రయాణం చేసేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఈ మార్గంలో మాత్రం బస్సులో 60 మంది ప్రయాణీకులు అంటే సీటింగ్ నిండితే చాలు ఇక ఈ అద్దె బస్సు డ్రైవర్లు ఎక్కడా ఆపకుండా వెళ్లిపోతున్నారు.

భద్రాచలం-వెంకటాపురం రూట్‌లో నిత్యం ఇటువంటి ఘటనలే ఎదురవుతున్నప్పటికీ ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు మాత్రమే ఇలా వ్యవహరిస్తున్నారని ఆర్టీసీ సంస్థకు చెందిన డ్రైవర్లతో ఎటువంటి ఇబ్బంది లేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. తాము లేకుంటే ఆర్టీసీ డిపోనే లేదన్నట్లుగా, తమ యజమానులు ఆర్టీసీలో ఎంత చెబితే అంతే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారంటూ పలువురు విమర్శిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బస్సుల్లో ఎక్కేందుకు అవకాశం ఉన్నప్పటికీ బస్సులను ఆపకుండా వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు, యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్టాపుల్లోనూ ఆపడం లేదు



బస్సులలో ఖాళీ ఉన్నప్పటికీ డ్రైవర్లు బస్సులను ఆపకుండా వెళ్తున్నారు. చెయ్యెత్తండి.. బస్సెక్కండి అంటున్నారు ఆర్టీసీ అధికారులు. కానీ గ్రామాల్లో మాత్రం బస్టాప్‌లలో కూడా బస్సులు ఆపడం లేదు. ఇటువంటి వారిపై ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎం.భావన, విద్యార్థిని, చర్ల మండలం

చర్యలు తీసుకుంటాం



అవకాశం ఉన్న మేరకు ప్రయాణికులను ఎక్కించుకోవాలి. అవకాశం లేకుంటే బస్సు ఆపి బస్సులో పరిస్థితిని ప్రయాణికులకు చెబితే ప్రయాణికులు కూడా అర్థం చేసుకుంటారు. కొన్ని రూట్లలో ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు బస్సులు ఆపకపోవడంపై చర్యలు తీసుకుంటాం.

– తిరుపతి, డిపో మేనేజర్, భద్రాచలం

బస్సు సర్వీసులు ప్రారంభం



బస్సును ప్రారంభించి ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే తెల్లం, ఆర్టీసీ డీఎం తిరుపతి

భద్రాచలంఅర్బన్: తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ కల్పిస్తున్న సౌకర్యాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కోరారు. మంగళవారం భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్‌కు నూతనంగా రెండు రాజధాని బస్సులను ఆయన ప్రారంభించారు. సదరు బస్సులో డిపో నుంచి పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వరకు ప్రయాణించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రయాణికుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలం డిపోకు రెండు నూతన బస్సులను కేటాయించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతి, చీఫ్ ఇన్స్‌పెక్టర్ గౌతమీ, ఇతర సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు ధ్రువపత్రాలతో లబ్ధి'



సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ సంఘాల నాయకులు

చర్ల: గడిచిన 25 ఏళ్ల పాటు బోగస్ ఎస్టీ కుల ధ్రువపత్రంతో ప్రజలను, ప్రభుత్వాలను మోసం చేసి ప్రభుత్వ పరంగా లబ్ధి పొందిన మాజీ ఎంపీపీ గీదా కోదండరామయ్యపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం మండల కేంద్రంలోని ప్రయివేటు డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన ఆదివాసీ సంఘాల జేఏసీ సమావేశంలో ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ మాట్లాడారు. చర్లకు చెందిన గీదా కోదండ రామయ్య అనే గిరిజనేతరుడు 1988వ సంవత్సరంలో పాఠశాల రికార్డులలో టాంపరింగ్ చేసి ఎస్టీగా నమోదు చేయించుకుని మూడు సార్లు సర్పంచ్‌గా, రెండు సార్లు ఎంపీపీగా గెలిచాడని ఆరోపించారు. ఈయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయక పోడు సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి పున్నం రామ కృష్ణ, సీనియర్ ఆదివాసీ నాయకులు మాజీ ఎంపీపీ గొంది ముయ్యన్న, తుడుందెబ్బ డివిజన్ ఆర్గనైజర్ తాటి లక్ష్మణ్, ఆదివాసీ గిరిజన జేఏసీ రాష్ట్ర నాయకులు ఇర్పా ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రానికై ధర్నా



తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని తెలుగుదేశం మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

చండ్రుగొండలో పెద్ద ఎత్తున గోదాములు ఉన్నప్పటికీ సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వారాధి సత్యనారాయణ అన్నారు. క్వింటా పత్తి ధర 9వేలు చెల్లించాలన్నారు. ఈ మేరకు వినతిపత్రం తహసీల్దార్ సంధ్యారాణికి అందించారు. ఈ ఆందోళనలో పార్టీ నాయకులు చాపలమడుగు వెంకటేశ్వర్లు, సున్నం శోభన్, జి.బాలు, పోట్రు వేణు, వెంకటి, ప్రసాద్, శ్రీను, దాసు పాల్గొన్నారు.

హైలెవల్ వంతెనపై గుంతలు



వంతెనపై రబ్బరు షీట్ల వద్ద ఏర్పడిన గుంతలు

చర్ల: మండలంలోని తేగడ సమీపంలో ఉన్న తాలిపేరు హైలెవల్ వంతెనపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. వంతెనపై గతంలో ఆర్అండ్‌బీ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఓ కాంట్రాక్టర్ బీటీని వేశాడు. అప్పటి నుంచి గుంతల కష్టాలు మొదలయ్యాయి. రెండేళ్ల క్రితం భద్రాచలం –వెంకటాపురం మార్గంలో పలు చోట్ల భారీ వర్షాల వల్ల రోడ్లు దెబ్బతినడంతో అక్కడక్కడా మూడేసి, నాలుగేసి కిలోమీటర్ల చొప్పున ఈ రోడ్డుకు బీటీ వేశారు. అయితే నిర్మాణ పనులు చేసిన కాంట్రాక్టర్ వంతెనపై (సిమెంట్ కాంక్రీట్ మీద) కూడా బీటీ వేసేశాడు. ఆర్ కొత్తగూడెం నుంచి తేగడ వంతెన ప్రారంభం వరకు మాత్రమే బీటీ వేయాల్సి ఉండగా ఏకంగా వంతెనపై కూడా బీటీ వేసేశాడు. అయితే వంతెనపైచి పిల్లర్‌కు పిల్లర్‌కు మధ్యలో రబ్బరు షీట్లు ఉండగా వాటిపై వేసిన బీటీ లేచిపోయింది. దీంతో వంతెనపై రబ్బర్లు ఉన్న ప్రాంతంలో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. బీటీ వేసే సందర్భంలో ఆర్అండ్‌బీ అధికారులకు విషయం తెలిసినప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడంతో ఇప్పుడు వాహనాల ద్వారా రాకపోకలు సాగిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

మణుగూరుటౌన్: ఉచిత కంటి ఆపరేషన్లు చేయించుకోవాలనుకునే వారికి మణుగూరు ఏరియా ఆస్పత్రిలో బుధవారం ఏర్పాట్లు చేసినట్లు నేత్ర వైద్యసహాయకులు సంజీవరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలు తీవ్రంగా ఉన్నవారిని గుర్తించి మారుతి నర్సింగ్ కాలేజ్ భద్రాచలం నుంచి సికింద్రాబాద్ వరకు ఉచిత బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15 విడుతలుగా 40 మంది చొప్పున కంటి ఆపరేషన్లకు పంపించడం జరుగుతుందన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్నవారు కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

14న వాహనాల వేలం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాటు సారాను అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఈనెల 14న బహిరంగ వేలం వేస్తున్నట్లు సీఐ షేక్ రహిమున్నిషా బేగం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్, పాన్ కార్డులతో ఉదయం 11 గంటలకు ఎక్సైజ్ స్టేషన్‌లో జరిగే వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఉచిత యోగా శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని అన్నపూర్ణ ఫంక్షన్‌హాల్‌లో భద్రాద్రి యోగా ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఉచిత యోగా ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు యోగా గురువు నరేష్ గురూజీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి డిసెంబర్ 16 వరకు నెల రోజుల పాటు ఈ యోగా శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 5.30 నుంచి 6.30 వరకు.. మరలా సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు శిక్షణ ఉంటుందని, 14 సంవత్సరాలు నిండిన స్త్రీలు, పురుషులు యోగా శిక్షణకు హాజరుకావచ్చని తెలిపారు.

ముగిసిన శిక్షణ

అశ్వారావుపేటరూరల్: స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో గడిచిన రెండు రోజులుగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మధు హాజరై కార్మిక చట్టాలు, లేబర్ కోడ్, కేంద్ర, కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్మికులకు జరుగుతున్న నష్టాలు, ఇబ్బందులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టల అర్జున్, కె.పుల్లయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

అన్నదానం

చర్ల: కార్తీకమాసంలోని మంగళవారం సందర్భంగా మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ సమీపంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో అన్నదానాన్ని నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమానికి మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.

పుకార్లను నమ్మొద్దు

ములకలపల్లి: ఇంటింటి సర్వేలో అనవసర పుకార్లను నమ్మవద్దని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు అన్నారు. మండల పరిధిలోని రాజీవ్‌నగర్‌కాలనీలో మంగళవారం చేస్తున్న ఇంటింటి సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. సర్వేను పక్కాగా నిర్వహించాలని అన్నారు. సర్వే బృందాలకు ప్రజలు సహకరించాలని సూచించారు. గ్రామశాఖ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, సోయం నాగరాజు, మడకం కిరణ్, నూపా రాజు, చిన్ననాగులు పాల్గొన్నారు.

ఆరబెట్టిన ధాన్యానికి మద్దతు ధర



మణుగూరుటౌన్: తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల

మణుగూరుటౌన్/పినపాక: రైతులు దళారులను ఆశ్రయించకుండా వరి ధాన్యాన్ని ఆరబెట్టి ప్రభుత్వ కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు సూచించారు. మణుగూరు మండలం పగిడేరులో డీసీఎంఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకానికి రూ.500 బోనస్ ప్రకటించినందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే, పినపాక మండలం భూపాలపట్నంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సైతం ఎమ్మెల్యేపాయం ప్రారంభించారు. రైతులకు లాభం జరిగేలా తెలంగాణలో మాత్రమే సన్న రకాలకు రూ.500బోనస్ ప్రకటించినట్లు తెలిపారు. ఏడీఏ తాతారావు, తహసీల్దార్లు రాఘవరెడ్డి, నరేష్, ఎంపీడీఓలు శ్రీనివాసరావు, రామకృష్ణ, ఎంపీఓ వెంటేశ్వరరావు, కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు పీరినాకి నవీన్, రామనాథంతో పాటు తాటి భిక్షం, సావిత్రి, కూచిపూడి బాబు, గాండ్ల సురేశ్, ముల్క నరేశ్, సైదులు, సత్యనారాయణ తదిరులు పాల్గొన్నారు. కాగా, పినపాక మండలం భూపాలపట్నంలో కుటుంబ సర్వేను ఎమ్మెల్యే పాయం పరిశీలించి మాట్లాడారు. ప్రజలెవరూ అపోహలు గురికాకుండా పూర్తిసమాచారాన్ని ఉద్యోగులు ఇవ్వాలని, తద్వారా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు.

డ్రెయినేజీ పనులు పరిశీలన



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న డీపీఓ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని కరకట్ట ప్రాంతంలో నిర్మాణం జరుగుతున్న డ్రెయినేజీ పనులను జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి మంగళవారం పరిశీలించారు. అనంతరం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న బడ్డీ కొట్టుపై అందిన ఫిర్యాదును ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం డీపీఓ గ్రామ పంచాయతీ కార్యాలయన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట భద్రాచలం గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ సమావేశం

మణుగూరురూరల్: బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత తెలంగాణ భవన్ నుంచి సురక్షా బస్టాండ్ మీదుగా సాయిబాబా గుడివరకు, అక్కడ నుండి పద్మశాలిభవన్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ ఉంటుందని వెల్లడించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో జరిగే సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై చేయాల్సిన పోరాటాలు, గ్రామకమిటీల పునర్నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్లు తెలిపారు. నాయకులు, ముఖ్య కార్యకర్తలు హాజరుకావాలని కాంతారావు కోరారు.

జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



గీతాహర్షిణి



అక్షయ

దమ్మపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన మండలంలోని అంకంపాలెం ఆశ్రమ పాఠశాల బాలికలు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని గీతాహర్షిణి నారాయణపేట జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–17 రెజ్లింగ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే, 9వ తరగతి విద్యార్థిని అక్షయ ఖమ్మంలో జరిగిన అండర్–14 వాలీబాల్ పోటీల్లో సత్తా చాటగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపిక చేశారు. విద్యార్థినులను హెచ్ఎం శారద, పీడీ వెంకన్న, పీఈటీ నాగమణి, ఉపాధ్యాయులు అభినందించారు.

పశు వైద్యశిబిరం

చండ్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామంలో మంగళవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భకోశ వ్యాధిగ్రస్థ పశువులకు, దూడలకు వ్యాధి నివారణ మందులు అందించారు. డాక్టర్ వేమూరి సంతోష్, ఎర్రగుంట పశువైద్యాధికారి డాక్టర్ బుచ్చిబాబు, గోపాలమిత్రలు సాయిప్రకాష్, రాము, శ్రీనివాసరావు, నరేష్, వెంకట్‌దాస్ పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

అశ్వాపురం: ఐటీసీ బంధన్ సంస్థ వారు 2015 నుంచి మండలంలోని గ్రామాలలో 1000 మంది నిరుపేద ఒంటరి, వితంతు మహిళలకు ఆర్థిక సహాయం అందిస్తూ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎంపీడీఓ వరప్రసాద్ అన్నారు. మొండికుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐటీసీ బంధన్ సంస్థ నుంచి లబ్దిపొందిన ఒంటరి, వితంతు మహిళలతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ నరేష్ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు అభినందన



జమలారెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగులు

బూర్గంపాడు: మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బూర్గంపాడు ఎంపీడీఓ జమలారెడ్డిని మంగళవారం మండల పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జమలారెడ్డిని ఎంపీఓ సునీల్‌తో పాటు ఇతర ఉద్యోగులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీ సిబ్బంది శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.

గోతులు తవ్వారు.. వదిలేశారు



రోడ్డును ఆనుకుని తవ్వి వదిలేసిన గొయ్యి

దుమ్ముగూడెం: మండలంలోని కోయనర్సాపురం నుంచి రామచంద్రునిపేట గ్రామం వరకు రోడ్డు పక్కన భారీ గోతులను తవ్వి వదిలేశారని దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డు పక్కన గోతులు తవ్వి రోజులు గడుస్తున్నా వాటిని పూడ్చకపోవడంతో ఆ రహదారి వెంట ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాల పాలవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ ఏ అధికారి పట్టించుకోవడం లేదని, ప్రాణాలు పోతే తప్పా స్పందించరా అంటూ ప్రశ్నిస్తున్నారు. నిత్యం ఆ రహదారి గుండా వందల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చిన క్రమంలో ఆ గోతుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో తక్షణమే అధికారులు స్పందించి వాటిని పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్‌పై దాడిని ఖండిస్తూ నిరసన



అశ్వాపురం: తహసీల్ ఎదుట నిరసన తెలుపుతున్న తహసీల్దార్ స్వర్ణలత, అధికారులు

అశ్వాపురం: వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై దాడిని ఖండిస్తూ మంగళవారం తహసీల్దార్ స్వర్ణలత ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది తహసీల్దార్ కార్యాలయం ఎదుట, ఎంపీడీఓ వరప్రసాద్ ఆధ్వర్యంలో మండల పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్ మాట్లాడుతూ.. కలెక్టర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించే అధికారులపై దాడులు బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు కాంతయ్య, రాజేశ్వరరావు, యూడీసీలు రాజేశ్వరరావు, నర్సింహారావు, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

గుండాల: వికారాబాద్ జిల్లా కలెక్టర్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించాలని గుండాల తహసీల్దార్ ఇమ్మానుయేల్ అన్నారు. కలెక్టర్‌పై దాడికి నిరసనగా రెవెన్యూ సిబ్బంది మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సభలు పెడుతున్న క్రమంలో ఒక్కసారిగా జనం అధికారులపై దాడి చేయడం, వాహనాలు ధ్వంసం చేయడం దారుణం అన్నారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.